# తొలిరాత్రి

ఉమ - రాజారావుల పెళ్లి జరిగి అప్పుడే ఇరవైనాలుగు గంటలు కావస్తోంది. పెళ్లికి వచ్చిన చాలామంది బంధువులూ, స్నేహితులూ కూడా వెళ్ళిపోయారు. అతి ముఖ్యులనుకున్న వాళ్లు మాత్రం మిగిలారు. మిగిలినవారిలో రాజారావు తల్లీ తండ్రీ, చెల్లెలు ఉన్నారు. ఉమ తల్లితండ్రులతోపాటు అన్నా వదినలు పినతల్లి ఉన్నారు.

ఆ రోజు రాత్రి ఉమారాజారావుల పునస్సంధానం ఏర్పాట్లు జరిగాయి. తొలిరాత్రి... అంటే ఏ వ్యక్తి జీవితంలోనైనా ఎన్నో మధురానుభూతులతో నిండిన రాత్రే. రాజారావు ఉమ అందాన్ని చూసి, అణకువను చూసి కావాలనే ఆమెను పెళ్లి చేసుకున్నాడు.

ఆ రాత్రి ఆమెతో ఏకాంతంగా ఎన్నెన్నో విషయాలు మనసు విప్పి మాట్లాడుకోవాలని భావి జీవితానికి బంగారుబాటలు పంచుకోవటంలో ఆమె ఆలోచనలతో పాలుపంచుకోవాలని ఎదురుచూస్తున్నాడు.

ఉమను మెరుపుతీగలాగా అలంకరించి రాజారావు ఉన్న గదిముందుకు పేరంటాళ్లు తీసుకువచ్చారు. పాలగ్లాసు చేతికి అందించి "కొత్త పెళ్లికూతురా! నీ చేతికి అందించిన పాలగ్లాసు మీవారి నోటికందించాలి సుమా! ఆ తరువాతే నువ్వాపాలను రుచి చూడాలి!" అంది ఓ పేరంటాలు.

పెదవులపై తొణికిసలాడే ముసిముసి నవ్వులను మబ్బుచాటు జాబిలిలాగే దాచుకుంది ఉమ. "మీవారి పెదవులకు తాకిన పాలు మామూలు పాలకంటే మరీ రుచిగా ఉంటాయి సుమా! ఆ రుచులు రేపు చెప్పాలి మాకు!" అంది ఓ ఏడాది క్రితమే పెళ్లయిన స్నేహితురాలు.

ఉమ పేరుకు తగ్గట్టుగానే పెదవి విప్పకుండానే ఓరకంట "స్వానుభవమా?" అన్నట్టు చూసింది. ఆ చూపులు చూసిన పేరంటాళ్లు కళ్లతోటే నవ్వుకుని, ఆపుకోలేక మల్లెల జల్లులా ఫక్కున నవ్వారు. ఆ తీయని నవ్వుల శబ్దానికి అటు చూశాడు అలంకరించిన పాన్పుమీద కూర్చున్న రాజారావు.

పాలగ్లాసుతో గుమ్మంలో నిలబడిన ఉమను సున్నితంగా లోపలకు నెట్టి తలుపులు మూశారు పేరంటాళ్ళు నవ్వుతూ. తలుపు తెరిచి ఉన్నంతసేపూ జలపాతంలా వినిపించిన నవ్వుల సవ్వడి ప్రవాహ శబ్దాన్ని సంతరించుకుంది...

ఉమ చేత పాలగ్లాసుతో అక్కడే నిలబడిపోయింది. పెదవి విప్పి పలకటంలేదు. 'సిగ్గేమోలే!' అనుకున్నాడు రాజారావు.

'పోనీ ... కన్నెత్తి చూడటానికేం?' అనీ అనుకున్నాడు. 'తనే వెళ్లి పలకరించి సాదరంగా ఆహ్వానించాలేమో!' అనుకుని, లేచి ఆమెకు చేరువయ్యాడు. ఆమె

భుజంమీద చెయ్యి వేశాడు. చూపుడు వేలుతో ఆమె చుబుకాన్ని పైకెత్తి కళ్ళల్లోకి చూడాలని ప్రయత్నం చేశాడు.

ఆమె కళ్లు మూసుకుంది.

'తాదాత్మ్యమా?' అన్నట్టు నవ్వాడు రాజారావు.

"రా, కూర్చుని మాట్లాడుకుందాం!" అని నడిపిస్తూ ఆమె చేతిలోని పాలగ్లాసు తాను అందుకున్నాడు.

ఆమెను మంచంమీద కూర్చోబెట్టాడు. తానూ పక్కన కూర్చున్నాడు. తన చేతిలోని పాలగ్లాసును తన పెదవులకు అందించుకోకుండా, ఉమ పెదవలుకు అందించాడు.

'ఇదేం విడ్డూరం?' అన్నట్టు చూసింది ఉమ.

"తొలి రాత్రి ఒక్క రోజు నేను తాగి నీకిచ్చినా, ఆ తరువాత జీవితాంతం నువ్వు రుచి చూసిందే నేను తినాలి కదా!"

అర్థం కానట్టు చూసింది ఉమ.

"నువ్వు చేసిన ప్రతి వంటకం బాగుందో, లేదోనని రుచి చూశాకే నాకు పెడతావు! అలాగే ఇవాళ కూడా నువ్వు ఈ పాలను రుచి చూశాకే నాకు ఇస్తే బాగుంటుంది! అలా చేయటం సమంజసం కూడా! ప్రేమకు అంకురార్పణ తొలిరాత్రినుంచే కదా!" అన్నాడు రాజారావు.

అలా రాజారావు ఊహల్లో భ్రమిస్తూ ఉండగా, నవ్వుతూ ఏ హడావుడీ లేకుండా తలుపులు మూసిన చప్పుడయింది. వాస్తవంలోకి వచ్చిన రాజారావు ఆ చప్పుడుకు గుమ్మంవైపు చూశాడు.

ఉమ నిజంగానే పాలగ్లాసు చేతపట్టుకుని నిలబడింది. అతన్ని చూసింది. అతను రమ్మన్నట్టు చూపులతోనే పిలిచాడు.

ఒక్కసారి వెన్కకు తిరిగి చూసింది ఉమ రెండడుగులు వేశాక.

అర్థం చేసుకున్న రాజారావు లేచి వెళ్లి తలుపు లోపలనుంచి గడియపెట్టాడు.

ఉమ వెనకే నడిచి వస్తూ భుజంమీద చెయ్యి వేశాడు.

ఉమ విలవిల్లాడుతూ పడిపోయింది. చేతిలోని పాలగ్లాసు టీపాయ్‌మీద ఉన్న ఫలహారాలమీద పడి, దొర్లి నేలమీద పడింది చప్పుడు చేస్తూ.

పాలన్నీ నేలపాలయ్యాయి!

గది బయట ఊపిరి బిగపట్టుకుని, ఏం జరుగుతుందోనని భయం భయంగా ఎదురుచూస్తున్న తల్లీ తండ్రీ – శాంతా రాఘవరావుల గుండెలు ఒక్కక్షణం ఆగిపోయాయి.

"ఏమైందండీ?" అంది శాంత రాఘవరావుతో భయంగా.

అర్థం కానట్టు చూశాడు రాఘవరావు.

"లోపల ఆ చప్పుడేమిటి?" అంటూ రాజారావు తల్లీ, ఆడపడుచు కూడా వచ్చారు వాళ్ల గదిలోంచి బయటకు.

వియ్యపురాళ్లిద్దరూ ముఖాముఖాలు చూసుకున్నారు.

☆ ☆ ☆

గదిలో కాళ్లూ, చేతులూ కొట్టుకుంటూ గిలగిలలాడుతున్న ఉమను ఏం చెయ్యాలో తోచని రాజారావు తన జేబులు వెతుక్కుని, జేబులో తాళాలు లేవని గ్రహించి, ఎదురుగా టీపాయ్‌మీద పళ్లతోపాటు పళ్లు కోయటానికి పెట్టిన చాకును తీసుకుని ఉమ చేతిలో పెట్టాడు.

ఉమ ఆ చాకును గట్టిగా పట్టుకుంది.

☆ ☆ ☆

బయటనుంచి "ఏం జరిగిందిరా రాజా?" అంటూ అరిచింది రాజారావు తల్లి.

రాజారావు తండ్రి మాధవరావు కూడా అక్కడికి చేరుకుని "ఏదైనా ఉంటే వాడే పిలుస్తాడు కదా! మధ్యలో మీ హడావుడి ఏమిటి?" అన్నాడు.

బయట జరుగుతున్న హడావుడికి రాజారావు లేచి వెళ్ళి తలుపు తీశాడు. తలుపు తీయటమే తడవుగా రాజారావుతల్లీ, తండ్రీ, ఉమ తల్లీ తండ్రీ, మిగిలిన కావలసినవాళ్లు గబగబా లోపలకు వచ్చారు.

రాజారావు తన చేతికిచ్చిన కత్తిని ఉమ గట్టిగా నొక్కి పట్టుకోవడంతో చెయ్యి తెగి రక్తం కారుతోంది.

ఆ దృశ్యాన్ని చూసిన ఉమ తల్లి శాంత విలవిలలాడిపోతూ, "ఏం జరిగిందే తల్లీ! పడిపోవటమే కాకుండా ఆ రక్తం కూడా ఏమిటే?" అంటూ ఉమ పక్కనే కూలబడింది. చేతిలో ఉన్న కత్తిని తీసింది. దీనంగా, భయంగా రాజారావు ముఖంలోకి చూసింది.

విషయాన్ని అర్థం చేసుకున్న రాజారావు తల్లి రెచ్చిపోతూ, "మరీ ఇంత దారుణమా! మూర్ఛపిల్లని అంటకట్టి నా కొడుకు జీవితాన్ని నాశనం చేస్తారా? మోసం చేయటానికి మేమే దొరికామా మీకు? మావాడికేం తక్కువని? పిల్ల అందంగా ఉంది కదా అని కట్నం తక్కువయినా ఒప్పుకుంటే ఈ రోగిష్టిదాన్ని అంటకడతారా? మొదటి రాత్రి కాబట్టి సరిపోయింది! కొన్నాళ్లు కాపరం చేశాకే అయితే ఈ పీడా వదిలించుకోలేక చచ్చేవాళ్లం!" అంది వీరావేశంతో.

రాజారావు "అమ్మా!" అన్నాడు మందలింపుగా తల్లి ముఖంలోకి చూస్తూ.

ఉమ తండ్రి రాఘవరావు, వియ్యంకుడు మాధవరావు చేతులు పట్టుకుని, కాస్త పక్కకు తీసుకువెళ్లి, "బావగారూ! మిమ్మల్ని మోసం చేయాలని నా ఉద్దేశ్యం కాదు! పెళ్లయితే ఈ జబ్బు సర్దుకుంటుందన్నారు డాక్టర్లు! ఆడపిల్ల తండ్రిగా దాని బతుకు బాగుపడుతుందన్న ఆశతో దానికి మూర్ఛరోగం ఉందీ అని నేను చెప్పలేదు. ఇప్పుడే దాన్ని వదిలేసి మీ అబ్బాయిని తీసుకుని వెళ్లిపోవటం కంటే, రెండు మూడు నెలలు కాపురం చేశాక అప్పటికీ ఈ రోగం తగ్గకపోతే అప్పుడే వదిలెయ్యమనండి! తాళి కట్టించుకున్న తరువాత ఆ మరుక్షణం నుంచీ, చచ్చేదాకా అది అతని భార్యే కదా!" అన్నాడు దీనంగా.

రాఘవరావు మాటలకు మాధవరావు గుండె నీరయిపోయింది. "తండ్రి మనసు నాకు తెలుసు, బావగారూ! నేనూ ఓ ఆడపిల్ల తండ్రినేగా! మీరు భయపడకండి!" అన్నాడు మాధవరావు.

వరమిచ్చే దేవుడు కళ్లముందు సాక్షాత్కారిస్తే పరవశించిన భక్తునిలా చేతులెత్తి నమస్కారం చేశాడు రాఘవరావు - మాధవరావుకు.

రాజారావు తల్లి గొంతు ఇంకా ఆగలేదు. ఇంకా ఇంకా ఏవేవో మాట్లాడుతూనే ఉంది.

ఉండబట్టలేని రాజారావు - "అమ్మా! ఉమతో నాకు పెళ్లయిన తరువాత ఈ మూర్ఛరోగం నాకు వచ్చివుంటేనో, మొదటి రాత్రి ఇలాగే నేను పడిపోవటం జరిగితేనో ఉమకి నన్ను వదిలెయ్యమని సలహా ఇస్తావా. అమ్మా! ఉమ నా భార్య! ఇక నువ్వు మాట్లాడకు! నన్ను ఎక్కువ మాట్లాడించకు!" అన్నాడు తీక్షణంగా.

అప్పటికి రాజారావు తల్లి నోరు మూతపడింది.

శాంత కూతురు ముఖంమీద నీళ్లు చల్లి ఉపచర్యలు చేయటంతో ఉమకు కాస్త స్పృహ వచ్చింది. తెగిన చేతికి తడిగుడ్డ చుట్టింది శాంత. ఉమ లేచి కూర్చుంది.

తన జీవితంలో తొలిరాత్రి ఇంత అల్లరిపాలు కావటంతో తల వంచుకుని, తనలో తనే బాధపడసాగింది. ఇదే తన జీవితానికి ఆఖరి రాత్రేమో అనుకుంది.

"ఇంక మీరందరూ బయటకు వెళ్లండి!" అన్నాడు రాజారావు.

ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని బయటకు వెళ్లిపోతున్నారు.

దగ్గరి బంధువు ఒకామె - "ఎంత మంచి మనిషైతే మటుకు ఒక మూర్ఛరోగితో ఎన్నాళ్లు కాపురం చేస్తాడు?" అంది.

"కాపురం చేసినా ఎప్పుడో అప్పుడు ఏదో విధంగా వదిలించుకోవాలని చూస్తాడు!" అంది మరొకామె.

"ఇలాంటి రోగాలు రాకూడదు కానీ, వచ్చాక పుల్లల్లో పెడితే కానీ పోవు!" అంది రాజారావు తల్లి.

వాళ్ల మాటలు ఉమకు వినపడ్డాయి.

ఇంక ఏం మాట్లాడినా ఉమకు వినపడకూడదని రాజారావే వెళ్లి గది తలుపులు మూసి వెనక్కు వచ్చాడు.

బెదురు బెదురుగా చూస్తున్న ఉమతో "నువ్వు విశ్రాంతి తీసుకో! లేని పోనివేమీ ఆలోచించుకోకు! మళ్లీ పొద్దున్నే ప్రయాణం కదా మనకు!" అన్నాడు రాజారావు.

అతని ముఖంలోకి - "నిజంగానే మనం రేపు కలిసి వెళ్తున్నామా?" అన్నట్టు అనుమానంగా చూసింది.

ఆమె మనసులో "కాపురం చేసినా ఎప్పుడో అప్పుడు ఏదో విధంగా వదిలించుకోవాలని చూస్తాడు" అన్న మాటలు ప్రతిధ్వనించాయి.

కళ్లు మూసుకుని పడుకున్నా ఆమెకు నిద్రపట్టలేదు.

నిద్రలో కూడా రాజారావు ఆమెను తాకలేదు.

నిద్రపట్టని ఉమ తనని తాకనైనా తాకని రాజారావు మీద ఏవేవో అనుమానాలు పెంచుకోసాగింది.

☆ ☆ ☆

తెల్లవారింది.

ఉమను అత్తవారింటికి పంపటానికి ఏర్పాట్లు అన్నీ జరిగాయి.

రాజారావు తల్లికి ఇష్టం లేకపోయినా భర్త మాధవరావు మాటమీద, కొడుకు పట్టుదలమీద నోరెత్తే అవకాశం లేకపోయింది.

రాజారావు ఉమను వెంట తీసుకుని తను ఉద్యోగం చేస్తున్న హైదరాబాదుకు బయలుదేరాడు.

☆ ☆ ☆

కొత్తకాపురం.

ఇంట్లో పనిమనిషి ఉంది.

ఉమ రాజారావుకు కావలసినవన్నీ సమకూరుస్తూనే ఉంది. ఫలహారాలు, భోజనాలు తయారుచేయటంలో ఏ లోపమూ లేదు.

కాకపోతే, రాత్రవుతోందంటే ఉమకు ఒకరకమైన భయం ... రాజారావుకు ఇంకోరకమైన భయం!

అతను ఆప్యాయంగా ముట్టుకుంటే తనకు ఫిట్సొచ్చి పడిపోతుంది. ఆ తరువాత తనను వదిలించుకునేందుకు ఏం చేస్తాడో ఏమో అని ఉమకు భయం.

తీరా తాను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంటే ఎక్కడ ఆమెకు ఫిట్సొస్తుందో, ఎక్కడ ఆమెను బాధపెట్టినవాణ్ణవుతానోనని రాజారావుకు భయం.

పగలు ఎంత అన్యోన్యంగా ఉన్నా, రాత్రి అయ్యేసరికి చేరువ కావటం అంతంతమాత్రమే!

ఆఫీసుకు వెళ్లిపోతూ పనిమనిషిని పిలిచి "నేను అయిదు గంటలకు ఆఫీసునుంచి వచ్చేదాకా నువ్వు అమ్మగారిని చూసుకుంటూ ఇంట్లోనే ఉండాలి సుమా! అవసరమైతే ఆఫీసుకు ఫోన్ చేయి!" అని రాజారావు హెచ్చరించి ఆఫీసుకు వెళ్లేవాడు.

పనిమనిషి "సరే, బాబూ!" అని తలూపేది.

"నేనెక్కడికీ పారిపోకుండా ఈ పనిమనిషి నాకు కాపలా అన్నమాట!" అనుకునేది ఉమ.

ఆఫీసునుంచి వచ్చాక సాయంత్రపు వేళ రాజారావు ఉమను తీసుకుని తన కారులో బయలుదేరేవాడు. ఓరోజు నౌబత్ పహాడ్, ఓ రోజు బిర్లామందిర్, ఓరోజు సంజీవయ్య పార్క్ ... అలా ... కూడా ఉండి తిప్పుతూండేవాడు.

ఎక్కడకు వెళ్లినా ఉమకు ఒకే అనుమానం. నౌబత్ పహాడ్‌కు వెళ్లినపుడు 'ఈ కొండమీదనుంచి ఏదో అదను చూసి నన్ను కిందకు గెంటేస్తాడు! ఫిట్సొచ్చి పడిపోయానని అందరికీ చెపుతాడు. నాకు నిజంగా ఆ జబ్బు ఉంది కాబట్టే అందరూ నమ్ముతారు! అలా నన్ను వదిలించుకుని వేరే పెళ్లి చేసుకుంటాడు. మరేం చేస్తాడు పాపం? ఎందుకూ పనికిరాని నన్ను కట్టుకుని ఏం సుఖపడతాడు?' అనుకుంది.

ఒకరోజు ఎగ్జిబిషన్‌కు వెళ్లి వచ్చిన తరువాత భోజనాలు చేసి రాజారావు,

ఉమ పడుకోబోతూ ఉండగా, "నువ్వు చక్కగా ఆరోగ్యంగా ఉన్నావు!" అన్నాడు రాజారావు.

అతని కళ్ళల్లోకి చూసిందామె.

"అలా చూస్తుంటే చాలా అందంగా ఉన్నావు!" సిగ్గుపడిందామె.

"అలా నువ్వు సిగ్గుపడుతుంటే విరిసీ విరియని మల్లెపువ్వులా ఉన్నావు!" అంటూ దగ్గరకు వచ్చి హత్తుకున్నాడు ఆవేశంగా.

మరుక్షణంలోనే ఉమకు ఫిట్టొచ్చింది.

ఆమెకు చేయవలసిన ఉపచర్యలన్నీ చేశాడు. తనను తాను తిట్టుకున్నాడు మనసులోనే.

ఆ మర్నాడు ఆఫీసునుంచి వచ్చాక ఉమను వెంట తీసుకుని ఎక్కడికో చెప్పకుండా తన కారులో బయలుదేరాడు రాజారావు. కారు మాసాబ్ టాంక్ వైపు వెళ్తోంది. సైకియాట్రిస్టుకి చూపించి, ఫిట్స్ రాకుండా ఉండటానికి మార్గం ఏమిటో కనుక్కోవాలని అతని ఉద్దేశం.

తనను ఎక్కడికో తీసుకుపోయి ఏదోలా వదిలించుకుంటాడీవేళ అనే భయం ఆమెలో.

తొలిరాత్రినాడు ఆవిడెవరో అన్న మాటలు ఉమ మెదడులో గంటల మోతలా ప్రతిధ్వనిస్తున్నాయి.

కారు నడుస్తోంది.

సిటీబస్సు ఫుట్ బోర్డుమీద నుంచి ఓ కుర్రాడు తూలి పడిపోయాడు. భుజాన బరువైన పుస్తకాలసంచీ!

జనం చుట్టూ మూగారు.

బస్సు చాలా దూరం వెళ్లిపోయాక ఆగింది.

రాజారావు తన కారు పక్కకుతీసి ఆపుచేశాడు. కుర్రాడి చుట్టూ మూగిన జనంవైపు నడిచాడు.

వెనక ఉమ కూడా వెళ్లింది.

"ఏం జరిగింది?" అన్నాడు రాజారావు జనాన్ని ఉద్దేశించి.

"కుర్రాడెవరో బస్సులోంచి పడిపోయాడు! తలకి బాగా దెబ్బ తగిలినట్టుంది!" అన్నాడో వ్యక్తి.

జనాన్ని తోసుకుని కుర్రాడి దగ్గరకు వెళ్లాడు రాజారావు.

"కుర్రాడికి అంత దెబ్బ తగిలితే చూస్తూ అలా నిలబడిపోయారేమిటి? హాస్పిటల్‌కు తీసుకువెళ్లి చేర్చవచ్చు కదా!"

ఆ మాట అనేసరికి ఎవరి మటుకు వాళ్లు తమతమ పనులమీద చల్లగా సర్దుకున్నారు.

ఆ కుర్రాణ్ణి భుజానికి ఎత్తుకున్నాడు రాజారావు. తలకు తగిలిన దెబ్బకి జేబురుమాలు కట్టి, తన పక్కనే కారులో కూర్చోపెట్టుకున్నాడు.

"జాగ్రత్తగా పట్టుకో, పాపం!" అన్నాడు ఉమను చూస్తూ.

ఉమ ఆ కుర్రాణ్ణి దగ్గరకు తీసుకుని పట్టుకుంది.

హాస్పటల్‌లోకి వెళ్ళి, డాక్టర్‌ని పిలిచి తగిలిన గాయానికి డ్రెస్ చేయించి, కట్టు కట్టించాడు రాజారావు. ఏ.టి.ఎస్. ఇంజెక్షన్ చేయించాడు.

ఇంజెక్షన్ చేసిన తరువాత తలకు దెబ్బ ఎలా తగిలింది? అన్నాడు డాక్టరు.

"బస్సు నుండి పడిపోయాడండీ!" అంది ఉమ.

"ఈ బస్సుల్లో ప్రయాణాలు ఎప్పుడూ ప్రమాదమే! బస్సులోంచి పడి కొంతమంది దెబ్బలు తింటారు. బస్సు కిందపడి కొంతమంది చస్తారు! పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలండీ!" అన్నాడు డాక్టరు.

"మా పిల్లవాడు కాదండీ! బస్సులోంచి పడిపోతే చూసి, ఎవరూ పట్టించుకోపోతే తీసుకువచ్చి హాస్పిటల్‌లో చేర్పించాను. ఇప్పుడింకేం ప్రమాదం లేదు కదా ఈ కుర్రాడికి?" అన్నాడు రాజారావు.

"ప్రమాదం ఏమీ లేదు. ఇప్పుడీ ట్రీట్‌మెంట్‌కి ఫీజు ఎవరిస్తారు?" అడిగాడు డాక్టరు.

"ఫీజు గురించి వర్రీ కాకండి! నేనే ఇస్తాను. ఇంకా జరగవలసిన వైద్యానికి కూడా నేనే ఇస్తాను. కాస్త స్పృహ వచ్చేలా చూడండి!" అన్నాడు రాజారావు.

"త్వరలోనే స్పృహ వస్తుంది. ఇతన్ని ఇప్పుడెవరు చూసుకుంటారు?" అన్నాడు డాక్టరు.

"స్పృహ వస్తే వాళ్ల ఇల్లెక్కడో తెలుసుకుని, తల్లీదండ్రి ఎవరో తెలుసుకుని పిలుచుకువస్తాను. అంతవరకూ మీరు మీ నర్సులే ఈ కుర్రాణ్ణి చూసుకోండి! ఎంత ఖర్చయినా ఫరవాలేదు!" అన్నాడు రాజారావు.

ఉమ ఒక్కసారి రాజారావు ముఖంలోకి చూసింది. అతని ముఖంలో ఏ స్వార్థమూ కనపడటంలేదు. ముక్కూ మొహం తెలియని ఓ కుర్రాడికి ఇన్ని సేవలెందుకు చేస్తున్నాడో అర్థం కాలేదామెకు.

కుర్రవాడికి స్పృహ వచ్చింది.

రాజారావు ఆ కుర్రాడి తల్లిదండ్రుల వివరాలు తెలుసుకుని, ఉమను వెంటతీసుకుని బయలుదేరాడు. ఆ ఇంటిని చేరుకున్నాడు.

అది ఒక మురికివాడ. ఆ కుర్రాడి తండ్రి ఒక హమాలీ, బళ్లమీద సామాను వేసుకుని తనే లాగి, ఆ సంపాదనతో బతుకుతున్నవాడు. కొడుకును చదివించుకుని, తన బతుకులా కాకుండా, వాడి బతుకు బంగారం కావాలనే కలలు కంటూ శ్రమిస్తున్నాడు, జీవిస్తున్నాడు.

అతన్ని, అతని భార్యనీ కారెక్కించుకుని దెబ్బతిన్న కుర్రాడున్న హాస్పిటల్‌కు తీసుకువచ్చాడు రాజారావు. వాళ్ల బిడ్డను వాళ్లకు అప్పచెప్పాడు. పూర్తిగా ఆ కుర్రాడు కోలుకునేదాకా హాస్పిటల్‌నుంచి తీసుకు వెళ్ళొద్దని చెప్పాడు. ఆ కుర్రాడి వైద్యానికి అవసరమైన డబ్బు ఇచ్చాడు డాక్టర్లకి. ఆ కుర్రాడు కోలుకునేదాకా తల్లీ తండ్రీ అక్కడుండటానికి అవసరమైన డబ్బు కూడా కుర్రాడి తల్లిదండ్రులకిచ్చాడు.

ఎంతో కృతజ్ఞతా భావంతో ఆ కుర్రాడు, అతని తల్లిదండ్రులూ రాజారావుకి నమస్కరించారు.

డాక్టరు రాజారావును అదోలా చూశాడు.

ఉమను వెంటబెట్టుకుని రాజారావు ఇంటికి వెళ్లిపోయాడు.

☆ ☆ ☆

ఆ రాత్రి భోజనం చేసి ఏదో పత్రిక తిరగేస్తున్నాడు రాజారావు, ఉమ కూడా భోజనం చేసి వంటిల్లు సర్దుకువచ్చింది.

పాల గ్లాసు చేతిలో ఉంది.

ఆమెను ఆశ్చర్యంగా చూశాడు రాజారావు.

"మీకెంత తీపి ఇష్టమో అంత తీపి కలిపి రుచి చూసే తెచ్చాను, తీసుకోండి!" అంటూ అందించింది గ్లాసు.

రాజారావు ఆమె చేతిలోని గ్లాసును తీసుకుని, ఆమె కళ్లలోకి చూస్తూ ఓ గుక్కెడు పాలు తాగాడు.

ఆమె కళ్లనుంచి కన్నీటి ధార అతని పాదాలమీద పడింది.

"ఛ! ఏమిటిది!" అంటూ పాలగ్లాసు పక్కన పెట్టి, తాను తాకితే మళ్లీ ఎక్కడ ఫిట్టొస్తుందోనన్న భయంతో, తాకబోయి మానేశాడు.

ఆమె అతని గుండెలమీద వాలిపోయి, అతన్ని హృదయానికి మనసారా హత్తుకుని "మిమ్మల్ని నేను చాలా తప్పుగా అర్థం చేసుకున్నాను! నమ్మకం మీద అపనమ్మకాన్ని పెంచుకున్నాను. నన్ను ఎప్పుడో అప్పుడు ఏదో ఒకలా వదిలించుకుంటారని భయపడ్డాను! ఏ సంబంధ బాంధవ్యాలూ లేని ఓ కుర్రాడెవరో బస్సులోనుంచి పడిపోతే అంత ఆదరించి వైద్యం చేయించిన ఇంత మంచి మనసున్న మనిషిని నేను ఎంత తప్పుగా అర్థం చేసుకున్నానండీ! మిమ్మల్ని ఒక హంతకుడిగా ఆలోచించటంకంటే పాపం, ఇంకేమైనా ఉంటుందా? మీ ప్రేమను అర్థం చేసుకోలేకపోయిన పాపినండీ నేను!" అంది ఉమ.

అప్పుడు అతను ఉమను తన కౌగిట్లోకి తీసుకుని మనసారా హృదయానికి హత్తుకుని ఆమె కళ్లవెంట కారే కన్నీటిని తుడిచాడు!

ఇదే తమ తొలిరాత్రి అనుకున్నారు వాళ్లిద్దరూ!

★ ★ ★